నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 14 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఒకరికి రిమాండ్

మరో ముగ్గురిపై కేసుల నమోదు

భీమారం, జూలై 13 : మండలంలోని మద్దికల్ శివారులోని 35 ఎకరాల పత్తి పంటను నష్టం చేసిన ఘటనలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో భీమారానికి చెందిన కట్ట నాగరాజును శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. రెండేళ్లుగా రైతుల పంటను నష్టం చేసేలా ప్రోత్సహిస్తున్న ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన పర్తిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, భీమారం గ్రామానికి చెందిన చెరుకు సరోత్తంరెడ్డిపై కూడా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రైతులను బెదిరించినందుకుగాను భీమారానికి చెందిన నల్లాల రాజలింగుపై కేసు నమోదైనట్లు చెప్పారు. తాతల నాటి కాలం నుంచి వచ్చిన భూమిని 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, అక్రమంగా పట్టాలు చేసుకున్నారని బాధిత రైతుల ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కట్ట నాగరాజుపై ఇప్పటికే 9 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసులకు మద్దికల్ శివారులో బాధిత రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

స్కూటీలపై ర్యాలీ తీస్తున్న మహిళలు

మంచిర్యాల అర్బన్, జూలై 13 : జెట్ వికాస తరంగిణి గ్రీన్ సిటీ మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో మహిళా ఆరోగ్య వికాస్ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జెట్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆస్ట్రేలియా మెల్బోర్న్ సొసైటీ సహకారంతో ఐబీ, బెల్లంపల్లి చౌరస్తా, పోలీస్ స్టేషన్, మార్కెట్ రోడ్డు గుండా మహిళలందరూ స్కూటీలపై ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మంజూభాషిని, హనుమంతరావు, నరసింహారావు, కృష్ణారావు, మాధవీ రవీంద్ర, ఉషాక్రాంతి, రాజేశ్వర్‌రావు, బాలకృష్ణ రావు, లక్ష్మణరావు, మహిళలు పాల్గొన్నారు.

ఇసుక మాఫియా దాడికి గురైన రుద్రాపూర్ గ్రామస్తులు

ఆగని ఇసుక అక్రమ దందా

- అడ్డుకుంటున్న గ్రామస్తులపై దాడులకు దిగుతున్న ఇసుక మాఫియా
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు
- ఫిర్యాదు ఉంటే తప్ప పట్టించుకోవడం లేదని విమర్శలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇసుక మాఫియా రెచ్చిపోతున్నది. ఎలాంటి భయం లేకుండా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తమ ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలించవద్దని అడ్డుకుంటున్న గ్రామస్తులపై సైతం దాడులకు తెగబడుతున్నారు. అధికారులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నప్పటికీ వ్యాపారులు బెదరడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు ఇసుక రవాణాను అడ్డుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రామస్తులపై ఇసుక మాఫియా దాడులు

ఇటీవల చింతలమానేపల్లి మండలం రుద్రాపూర్ సమీపంలోని వాగులో నుంచి రాత్రి జేసీబీలతో ఇసుక ట్రాక్టర్లలో నింపి తరలిస్తుండగా గ్రామానికి చెందిన దుర్గం సుగుణాకర్, మోర్చె బాపురావు, కొట్రంగి శ్రీనివాస్, పెరుగు లక్ష్మణ్ పోలీసులకు తెలిపినా స్పందించలేదు. దీంతో 100 నంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని 6 ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఫిర్యాదు చేసిన నలుగురిపై పోలీసుల ఎదుటే ఇసుక అక్రమ రవాణాదారులు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రతి రోజూ వందల టన్నుల ఇసుక అక్రమ రవాణా

ఆసిఫాబాద్ జిల్లాలోని పెంచికల్‌పేట్‌లో ఇటీవల అధికారులు 235 ట్రిప్పులు ఇసుక డంపులను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. కొద్ది రోజుల ముందు రెబ్బెనలో దాదాపు 300 ట్రిప్పుల ఇసుక డంప్‌ని సీజ్ చేశారు. రెబ్బెన మండలంలోని గంగాపూర్ వాగు, కాగజ్‌నగర్ మండలంలోని రస్‌పల్లి వాగు, పెద్దవాగుల నుంచి, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్ మండలాల్లోని వాగుల నుంచి నిరంతరం ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నది. ఈ వాగుల్లో దొరికే నాణ్యమైన ఇసుక అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. ఇక్కడి నుంచి పట్టణ ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రోజుకు వందల టన్నుల ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నది. రెబ్బెన మండలంలోని లక్ష్మీపూర్, గంగాపూర్ వాగుల్లో జేసీబీల ద్వారా ట్రాక్టర్లలో ఇసుకను లోడ్‌చేసి తెచ్చి ఇసుకను డంప్ చేస్తున్నారు. గతేడాది ట్రాక్టర్ ఇసుక రూ.1200 నుంచి రూ.1500 వరకు ఉండగా ఇప్పుడు రూ.2 వేల వరకు విక్రయిస్తున్నారు. వాగుల్లో నుంచి తెచ్చి డంప్‌లుగా పోసిన ఇసుకను హైదరాబాద్ లాంటి దూర ప్రాంతాలకు లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. ఒక లారీ ఇసుక లోడ్‌కు లక్ష రూపాయలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. లోకల్‌గా జరిగే నిర్మాణాలకు ట్రాక్టర్ల ద్వారా నేరుగా ఇసుక తరలిస్తున్నారు.

అక్రమార్కులకు రాజకీయ అండదండలు..

రాజకీయ నాయకుల అండదండలు ఉన్న కొంత మంది వ్యాపారులు ఇసుకను అక్రమంగా తరలించడమే దందాగా మార్చుకున్నారు. స్థానిక అధికారులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ఇసుక రవాణాకు ఎలాంటి అడ్డూ అదుపులేకుండా సాగుతున్నది. కొద్ది రోజులుగా టాస్క్‌ఫోర్స్ అధికారులు, మైనింగ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నా అక్రమార్కులు బెదరడం లేదు. ఇసుక డంపులపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాలకు లారీలు, తదితర వాహనాల్లో ఇసుక తరలిస్తున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను ఆపాలని, ఇసుక మాఫీయా ఆగడాలను అడ్డుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పెంచికల్‌పేట్‌లో అధికారులు స్వాధీనం చేసుకున్న 230 ట్రాక్టర్ల ఇసుక డంప్

డబ్బులిస్తేనే ఎరువులు

రూ.5 వేల నుంచి రూ.10 వేలు చెల్లిస్తేనే ఇండెంట్



మహారాష్ట్రకు యూరియా తరలించేందుకు అధికారుల పరోక్ష సహకారం

- ఎరువులు ఇవ్వకుండా హాకా సెంటర్ల నిర్వాహకులకు వేధింపులు
- లంచం ఇచ్చినోళ్లకు వెంటనే ఇండెంట్ పెడుతున్న అధికారులు
- మంచిర్యాల జిల్లాలో వ్యవసాయశాఖ అధికారుల తీరుపై విమర్శలు

మంచిర్యాల, జూలై 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సబ్సిడీపై యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కావాలంటే లంచం ఇవ్వాలని మంచిర్యాల జిల్లా వ్యవసాయశాఖ అధికారులు తెగేసి చెప్తున్నారట. పీఏసీఎస్, డీసీఎంఎస్, హాకా ఏజెన్సీల కింద ఎరువుల దుకాణాలు ఉన్న వారంతా కలిసి ఒకరిని తమ దగ్గరికి పంపించాలని, మేం ఆయనతో మాట్లాడాక అంతా కలిసి మాకు డబ్బులు ఇస్తేనే యూరియా ఇస్తామని ఓ హాకా సెంటర్ నిర్వాహకుడికి వ్యవసాయశాఖ అధికారి చెప్పారట. చెన్నూర్‌కు సంబంధించిన మరో ఫర్టిలైజర్ డీలర్‌కు ఎరువుల ఇండెంట్ పెట్టేందుకు జిల్లా అధికారి ఒకరు రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారు. సదరు డీలర్ బుధవారం మంచిర్యాల వచ్చి సార్‌కు మామూలు ఇచ్చాకే పని పూర్తయి పోయినట్లు తెలిసింది. ఇలా ఎవరికి యూరియా, ఎరువులు కావాలన్నా చేతులు తడపక తప్పడం లేదని ఫర్టిలైజర్ షాపుల డీలర్లు, ఏజెన్సీల ఆధ్వర్యంలో ఎరువుల సెంటర్లు నడిపే నిర్వాహకులు చెప్తున్నారు. ప్రైవేట్ డీలర్లు అంటే ఏమో కానీ.. ఏజెన్సీల కింద నడిచే సెంటర్ల వారిని డబ్బులు డిమాండ్ చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం, పది రోజుల్లో మేము బదిలీపై వెళ్తున్నాం. వెళ్లే ముందైనా నాలుగు డబ్బులు సంపాదించుకోవాలంటూ అధికారులు చెబుతున్నట్లు తెలిసింది. ఇలా జిల్లా వ్యవసాయశాఖ అధికారుల తీరుతో రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలు కావాల్సిన పరిస్థితులు తలెత్తాయి.

లంచం అడిగారు ఇలా..

చెన్నూర్ రూరల్ మండలంలోని ఓ గ్రామంలో హాకా సెంటర్ నిర్వాహకుడు ఈ నెల 8వ తేదీన 30 టన్నుల యూరియాకు ఇండెంట్ పెట్టమని ఏవోకు లెటర్ ఇచ్చాడు. దానికి సదరు అధికారి మీరంతా కలిసి నేను చెప్పినట్లు ఓ పర్సన్‌కు ఎంచుకుని ఆయనతో డబ్బులు పంపిస్తేనే ఫైల్ ముందుకు కదులుతుందని చెప్పాడు. ఈ విషయాన్ని ఏడీ దృష్టికి తీసుకెళ్లగా అయిపోతుంది ఏవోతో నేను చెప్తానని చెప్పి మరునాడు ఆఫీసుకు పిలిపించుకుని లంచం ఇవ్వాలంటూ సున్నితంగా అడిగినట్లు సదరు సెంటర్ నిర్వాహకుడు ఆరోపిస్తున్నాడు. తాను లంచం ఇవ్వనని చెప్పడంతో అధికారులు నేను హాకా సెంటర్‌తోపాటు ప్రైవేట్ ఫర్టిలైజర్ షాప్ లైసెన్స్ ఉందని, రెండింటిలో ఒకటి క్యాన్సల్ చేసుకుంటేనే యూరియా ఇస్తామని కొర్రీ పెట్టారట. దీంతో బాధితుడు గత సీజన్‌లో హాకా సెంటర్ పెట్టుకునేందుకు అప్పుడున్న అధికారులు రూ.2 లక్షలు లంచం ఇచ్చానని, రూ.లక్ష డిపాజిట్ కట్టానని మొత్తం రూ.3 లక్షలు ఖర్చు పెట్టుకున్నానని చెప్తున్నారు. గతంలో లంచాలు ఇచ్చి, మళ్లీ ఇప్పుడు కూడా డబ్బులు ఇవ్వాలంటే తాను ఎక్కడికి పోవాలని ప్రశ్నిస్తున్నాడు. గత సీజన్‌లో ఒక లైసెన్స్ ఉండగానే, రెండో లైసెన్సు జారీ చేసిన అధికారులు అప్పుడెందుకు యూరియా, ఎరువులు ఇచ్చారంటూ ప్రశ్నిస్తున్నాడు. ఇప్పటికిప్పుడు లైసెన్సు రద్దు చేసుకోమంటే ఎలాగని, ఇంకొకరి పేరు మీదకు మార్చుకునేందుకైనా సమయం ఇవ్వాలి కదా అని అడుగుతున్నాడు. లైసెన్స్ మీద ఎరువులు తీసుకోవడానికి నాకు ఓ ఫామ్ ఉందని, ఎరువులు తీసుకోవడానికి అన్ని విధాలుగా అర్హుడిని. నాకు ఇండెంట్ ఎలా పెట్టరో చూస్తానని అధికారులు గట్టిగా చెప్పడంతో ఈ రోజు(13వ తేదీ)న ఇండెంట్ పెట్టారంటున్నాడు. రెండు రోజులు సెలవుల సమయంలో ఇండెంట్ పెడితే సోమవారం వరకు ఆగక తప్పని పరిస్థితి ఉందని ఆయన వాపోయారు. ఇక.. ఇదే చెన్నూర్ మండలంలో మరో హాకా ఫార్మర్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు 20 టన్నుల యూరియా కోసం జూన్ 24వ తేదీన ఇండెంట్ పెట్టుకుంటే ఇప్పటివరకు స్టాక్ రాలేదని తెలిసింది.

మహారాష్ట్రకు తరలింపు.. అధికారుల సహకారం..

డబ్బులు ఇచ్చిన డీలర్లకు మాత్రమే అధికారులు ఇండెండ్ పెడుతున్నట్లు తెలిసింది. ఇలా చాలా మంది డీలర్లు డబ్బులు ఇచ్చి ఇండెండ్ పెట్టుకుని వచ్చిన యూరియాను మహారాష్ట్రకు తరలిస్తున్నారు. కొన్ని రోజులు వర్షాలు పడుతుండడంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. మన రైతులకు రూ.290కి రావాల్సిన యూరియా బస్తా మహారాష్ట్రకు తీసుకెళ్లి విక్రయిస్తే రూ.400 వరకు వస్తుంది. దీంతో డీలర్లు మన రైతులకు యూరియా ఇవ్వడం కంటే పొరుగున ఉన్న మహారాష్ట్రకు తరలించేందుకే ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. అధికారులు కూడా డబ్బులు తీసుకుని ఇండెంట్ పెడుతూ ఈ దందా చేసే డీలర్లకు పరోక్షంగా సహకరిస్తున్నారు. మొన్నటికి మొన్న మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధమైన ఎరువుల లోడ్ ఒకటి దొరికింది. దీనితో నైనా కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు మామూళ్ల కోసం డిమాండ్ చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేటు నుంచి యూరియా తీసుకునే అవకాశం లేకపోవడంతో రైతులు డీలర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్దపెద్ద డిస్ట్రిబ్యూటర్లు దగ్గర యూరియా ఉన్నప్పటికీ వాళ్ల అవసరాలకు సరిపడా ఉంచుకుని మిగిలిన యూరియాను మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఇటు ప్రైవేటు నుంచి యూరియా రాక, అటు ప్రభుత్వం నుంచి సపోర్టు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సీజన్ ప్రారంభంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే, రానున్న రోజుల్లో పరిస్థితి ఏంటని వాపోతున్నారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయ అధికారి సురేఖను ఫోన్‌లో వివరణ కోరగా.. మా అధికారులు, ఎవరైనా లంచం అడిగినట్టు ఆధారాలు ఉంటే చర్యలు తీసుకుంటాం. గత సీజన్‌లోనూ ఇలాంటి ఆరోపణలు వచ్చినపుడు ఏవో, ఏడీలను సస్పెండ్ చేశాం.

చెట్టును ఢీకొన్న కారు.. బాలుడి మృతి

- కానిస్టేబుల్‌తో పాటు భార్య, తల్లికి తీవ్ర గాయాలు
- బర్త్‌డే ఫంక్షన్‌కి వెళ్లి వస్తుండగా ప్రమాదం

చికిత్స పొందుతున్న బాలుడి తల్లి గీత, నానమ్మ జీజాబాయి

జాదవ్ జైసన్‌రాజ్ (ఫైల్)

జన్నారం/ఉట్నూర్, జూలై13 : బర్త్‌డే వేడుకలకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు జాదవ్ జైసన్‌రాజ్(10) మృతిచెందగా మరో ముగ్గురికి గాయాలైన విషాద ఘటన మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని తొమ్మిదిగుడిసెలపల్లె వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. జన్నారం ఎస్ఐ రాజవర్ధన్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్ జిల్లా లింగాపూర్ మండలం కొత్తపెల్లి(చిక్కులగూడెం)కు చెందిన కానిస్టేబుల్ జాదవ్ గోపిచంద్ నార్నూర్ సీఐ వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం మంచిర్యాల జిల్లా మందమర్రిలో అతని బంధువుల ఇంట్లో పుట్టినరోజు వేడుకలకు హాజరై అర్ధరాత్రి ఇంటికి కారులో తిరిగి వస్తుండగా అడ్డుగా వచ్చిన పశువులను తప్పించబోయి చెట్టును ఢీకొన్నాడు. కారు నుజ్జునుజ్జుకావడంతో అందులో కుమారుడు జైసన్‌రాజ్ ఇరుక్కపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. గోపిచంద్‌తో పాటుగా అతని తల్లి జీజాబాయి, భార్య గీతకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి వారిని మంచిర్యాల దవాఖానకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుల బంధువు జాదవ్ భాంరావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల జిల్లా దవాఖానకు తరలించారు. బాలుడి మృతితో కొత్తపెల్లి గ్రామంలో విషాదం నెలకొన్నది.

అడ ప్రాజెక్టు కాలువలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యం

- అడ ప్రాజెక్టుకు రూ.20 కోట్లు కేటాయించాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, జూలై 13: సాగు నీటి ప్రాజెక్టులు, నీటి వనరులపై రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం చేస్తున్నదని, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. శనివారం కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గం గ్రామ పరిధిలోని అడ ప్రాజెక్టు కాలువలు, చెరువులు, డ్యాంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా అసంపూర్తిగా ఉన్న అడ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.20 కోట్లు మంజూరు చేయాలన్నారు. చెరువుల కాలువల్లో పూడిక పేరుకపోయినా తీయించడం లేదని, చెరువుల గేట్లకు మరమ్మతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అడ ప్రాజెక్టు కాలువలు తవ్వకాలతో కాంట్రాక్టర్ల జేబులు నిండాయి కానీ రైతులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. బెంగాలీ క్యాంపు నంబర్ 10లోని అప్పర్ డ్యాం, బెంగాలీ క్యాంపు నంబర్ 4లో లోయర్ డ్యాం, స్థానిక చెరువుల గ్రోయిన్ గేట్లు మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదన్నారు. కాలువలకు మరమ్మతు చేస్తే బెంగాలీ క్యాంపు పరిధిలోని సుమారు 3 వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగు నీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చొరవ తీసుకొని రూ.20 కోట్లు మంజూరు చేయాలన్నారు. లేదంటే స్థానిక రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లెండుగూరే శ్యామ్‌రావు, ఆవుల రాజ్‌కుమార్, కొండ రాంప్రసాద్, మిథున్ బిష్వాస్, నిత్యానంద్ మహంతు, కాశిపాక రాజు పాల్గొన్నారు.

ఆర్కే 7గని నార్త్‌లో ఉత్పత్తి నిలిపివేత

-300 మంది కార్మికులకు డిప్యూటేషన్లపై బదిలీ

శ్రీరాంపూర్, జూలై 13 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7గనిలో నార్త్ ఉత్పత్తి పనిస్థలాల్లో ఉత్పత్తి నిలిపి వేయాలని కేంద్ర ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. నార్త్ భాగంలో బొగ్గు ఉత్పత్తికి 2020 వరకే అనుమతి ఇచ్చినట్లు సమాచారం. 2019 నుంచి గని విస్తరణకు అనుమతి కోసం కేంద్ర ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్ డైరెక్టర్ ఆఫ్ జనరల్‌కు సింగరేణి యాజమాన్యం 4 సార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ రిజెక్ట్ చేస్తున్నారని తెలిసింది. అనుమతి వచ్చే వరకు ఉత్పత్తి నిలిపివేయాలని అధికారులు శనివారం ఆదేశించారని సమాచారం. నార్త్ పనిస్థలాల్లో ఉత్పత్తి నిలిచిపోవడంతో సుమారు 300 మంది ఉద్యోగులను ఇతర గనులకు తాత్కాలికంగా డిప్యూటేషన్‌పై బదిలీ చేయనున్నారు. నెల రోజుల్లో తిరిగి బొగ్గు ఉత్పత్తికి అనుమతలు వచ్చే అవకాశం ఉందని, అప్పుడు తిరిగి కార్మికులను ఆర్కే 7గనికి తీసుకుంటామని జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. .

అనుమతులివ్వడంలో కేంద్రప్రభుత్వం జాప్యం..

-టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి

శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7 గనిలోని నార్త్ భాగంలో ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం అనుమతులివ్వడంలో జాప్యంతో నేడు గని మూసివేయాల్సి వచ్చిందని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి ఆరోపించారు. డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తుండడంపై కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో అధికార పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీలు అనుమతులు ఇప్పించాలని డిమాండ్ చేశారు.

శ్రీరాంపూర్ ఆర్కే 7గని ముఖద్వారం

పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

ఏఆర్ పోలీసుల సేవలు భేష్

ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 13 : విధుల నిర్వహణలో ఏఆర్ పోలీసుల సేవలు భేష్ అని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్‌తో దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఏఆర్ పోలీసులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్, ట్రాఫిక్, క్రైం వంటి ప్రధాన విభాగాలతో పాటు ఏఆర్ విభాగం కూడా ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నదని అభినందించారు. ఎన్నికలు, పండుగలు, ఊరేగింపులు, ఘర్షణ వాతావరణంలో బందోబస్తు నిర్వహించడంపై ప్రశంసించారు. ఏఆర్ సిబ్బంది సంక్షేమానికి వైద్య శిబిరాలు, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ రాణా ప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆర్ఐఎంటీవో అంజన్న, ఆర్ఐ హోంగార్డ్ ఇన్‌చార్జి భరత్ భూషణ్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు విజయ శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679